


## నా మాట

2023వ సంవత్సరంలో స్వాతంత్ర్య భారతదేశంలో బ్రతుకుతున్న అదృష్టవంతులం మనం. భారతదేశం, భారతీయ సమాజం అన్ని రంగాల్లో ఎంతో ప్రగతిని సాధించిన తరువాత పుట్టిన మనం, ఎన్నో రకాలుగా మన ముందు తరాల కంటే అదృష్టవంతులం. ముఖ్యంగా మనకు పరాయి పాలనలో బ్రతికినప్పటి భారతీయుల రాజకీయ, సామాజిక పరిస్థితుల గురించి అవగాహన లేదు. అలాగే, ఆనాటి మహిళల జీవితం గురించి కూడా! ఈ అంశాల గురించి సమగ్రమైన నవల వెలువడిందో, లేదో నాకు తెలియదు. అయితే నేను రాసిన ఈ నవలలో ఆ రెండు రంగాలు స్పృశించబడ్డాయి. కథాగమనానికి అవసరమైనంత వరకే వాటిని ప్రస్తావిస్తూ ముందుకి వెళ్ళాను. కారణం పాఠకులకు నవల చదివే ఆసక్తిని దూరం చేయకూడదనే!

ఈ నవల రాయటానికి 2020 ఏప్రిల్ 25న గతించిన, శ్రీ మంచాళ సీతారామారావుగారి భార్య,, మా తల్లి శ్రీమతి స్వరాజ్యలక్ష్మి గారు ప్రేరణ.

90 సంవత్సరాల నిండు జీవిత కాలంలో ఆవిడ అప్పుడప్పుడు ఆవిడ చిన్ననాటి సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితుల గురించి మాతో పంచుకున్న జ్ఞాపకాల పరిమళంతో ఈ నవలా సుమం వికసించింది. ఇందులో పాత్రలన్నీ పూర్తిగా కల్పితాలు. జీవించి ఉన్న లేదా మరణించిన ఏ వ్యక్తి తో నైనా ఎవరికైనా పోలికలు కనిపిస్తే అది కేవలం కాకతాళీయకం మాత్రమే. వాస్తవికంగా కనిపించే రచన చేయటం కోసం కొందరు గొప్ప దేశ నాయకుల పేర్లను వాడటం జరిగింది. అది ఈ తరం వాళ్లకు వారి గొప్పదనాన్ని తెలియజేయటానికి మాత్రమే!

ఈ నవల చదివి, జీవితాన్ని ఫలవంతం చేసుకున్న ఓ మహిళా మూర్తి నుంచి, ఏ ఒక్కరైనా స్ఫూర్తి పొందితే దీని ప్రయోజనం సిద్ధించినట్లే. ఆమె గుణగణాలలో సగమైనా పుణికి పుచ్చుకున్న 'మహిళా రత్న'లు నిజంగా ఎక్కడైనా ఉంటే వారికి నా పాదాభివందనం. వారి జీవితమే ఈ "భారతీయం."

ఈ నవలా రచనకు నాతో పాటు, నేను పడినంత కష్టాన్నీ పడి ప్రోత్సహించిన నా కుటుంబ సభ్యులకు, మిత్రులకు కృతజ్ఞతలు చెప్పుకోకపోతే, ఈ నవలను నేను రచించానని చెప్పుకునే
సాహసం నేను చెయ్యలేను.

ఇది నా తల్లిదండ్రులు మంచాళ స్వరాజ్యలక్ష్మి, మంచాళ సీతారామారావు గార్ల దివ్య స్మృతికి చిన్న కూతురు 'చిన్నా' భక్తి ప్రేమలతో ఇచ్చిన పుస్తక నీరాజనం.

## (గత సంచిక తరువాయి)

తల్లిదండ్రులు ఇంట లేని కారణంగా చెల్లెలిని పురిటికి తేవటం తన వంతు బాధ్యతగా భావించిన సుబ్బారావు, చెల్లెలిని కాన్పుకి తీసుకు వద్దామనుకున్నప్పుడు హైమవతి భర్త పార్వతీశం సున్నితంగానే తోసిపుచ్చాడు.

"బావా, నేను నీ చెల్లెలిని వదిలి దేశ సేవకు పరిగెత్తలేను కానీ, నా అత్తమామలు దేశం కోసం పోరాడుతున్నప్పుడు నా భార్యను జాగ్రత్తగా చూసుకోగలను. నీ చెల్లెలికి ఏ లోటూ రాకుండా పురుడు జరిపించే బాధ్యత నాది. నీకు ఇప్పటికే ముగ్గురు పిల్లల బాధ్యత ఉంది. నా మాట విను. మా చెల్లెలి మీద ఎత్తలేని బరువు మోపటం న్యాయం కాదు. అయినా మీ బాపట్ల కన్నా మా గుంటూరు లో లేని వసతులు ఏమున్నాయి?"

బావగారి మాటలలోని నిజాన్ని కాదనలేక పోయిన కామేశం, కృతజ్ఞతా పూర్వకంగా పార్వతీశం చేతులు పట్టుకున్నాడు.

"అలా అని కాదులే. కానీ ఆడ సాయం లేదుకదా. ఇంట్లో పెద్దదిక్కు కూడా లేదు కదా బావా "

"అదేమీ పరవాలేదులే బావా. మన శయనమ్మ గారున్నారు కదా. హైమవతికి తల్లి దగ్గర లేని లోటు ఆమె తెలియనియ్యట్లేదు. ఏ నాటి రుణమో. అయినా కాన్పవగానే నీకు కబురు పంపుతాలే బావా, వెంటనే వచ్చి మేనకోడలినో, అల్లుడినో చూసుకుందువుగాని. పద, భోజనం చేసి బయల్దేరుదువు గాని. మరలా అక్కడ మా చెల్లాయి ఒక్కతే సమర్ధించుకోవాలి లేకపోతే " నవ్వుతూ చెప్పాడు పార్వతీశం.

అతనికి బావమరిది సుబ్బారావు మీద ఎంతో ప్రేమ. తల్లిదండ్రులు దేశ సేవకి అంకితమయ్యి కుటుంబాన్ని పట్టించుకోకుండా తిరుగుతున్నా, పెద్ద కొడుకుగా సంసార భారాన్ని నెత్తికెత్తుకున్న అతన్ని చూస్తే గౌరవంతో పాటు ఏమూలో కొంచెం జాలి కూడా అని చెప్పవచ్చు. ఆ సంవత్సరమే చదువు పూర్తి చేసిన సుబ్బారావు తన ఊళ్ళోనే తండ్రికి అండగా ఉండి వ్యవసాయం చూసుకుంటున్నాడు. అతని భార్య శారద కాపురానికి రాగానే, అంత పెద్ద సంసారపు బాధ్యతా నెత్తి కెత్తుకుంది ఆనందంగా. అందుకే ఆ దంపతులంటే ఎంతో అభిమానం పార్వతీశంకి. దేశ సేవలో సదా మునిగి ఉండే అత్తగారికి కుడిచెయ్యి అయ్యి గంపంత సంసారాన్ని నెత్తికెత్తుకునే కోడళ్లెందరుంటారు?

★★★★★

భర్త తమ ఊరికి తిరిగి వచ్చి హైమ పురిటికి రాదని చెప్పగానే శారద ఎంతో నిరుత్సాహ పడింది. బాధపడింది కూడా. అయితే ఆడపడుచు వ్రాసిన ఉత్తరం ఆమె కెంతో ఊరట నిచ్చింది.

ప్రియమైన వదినా,

ఉభయకుశలోపరి. నేనిక్కడ క్షేమంగా ఉన్నాను. నువ్వు, తమ్ముళ్లు క్షేమమని తలుస్తాను. నువ్వెంతో అభిమానంగా నన్ను పురిటికి తీసుకురమ్మని అన్నయ్యను పంపావు. చాలా సంతోషమనిపించింది. కానీ వదినా, అక్కడి నీ పరిస్థితి నాకు తెలుసు. అమ్మ కూడా ఉప్పుసత్యాగ్రహంలో పాల్గొనటానికి నాన్నగారిని అనుగమించిందని విన్నాక, నీ మీద పని వత్తిడి ఎంత పెరిగి ఉంటుందో ఊహించుకోగలను. నీ మరుదుల బాధ్యతే గాక, ఆ ఇంట్లో అతిథి, అభ్యాగతుల తాకిడి ఎలా ఉంటుందో నేనెరుగనిది కాదు. నువ్వు నీ కుటుంబానికే కాక, దేశానికి కూడా సేవ చేయక ఊరుకోవు. అత్తగారికి తగ్గ కోడలివి కదా. అందునా పెద్ద కోడలివి. ఇంటికే కాదు, ఆ ఊరికి కూడా. నీ సంగతి నాకు తెలుసు. అందుకే మీ అన్నయ్య ఈసారి పురుడు ఇక్కడే పోసుకొమ్మంటే నేను వెంటనే ఒప్పుకున్నాను. అమ్మా వాళ్ళు తిరిగి వచ్చాక, పుట్టబోయే పిల్లనో, పిల్లవాడినో ఎత్తుకుని మరీ నిన్ను చూడటానికి వస్తాను. అలాని నువ్వు నా తల్లివి కావని అంటున్నానని అనుకోకేం? నువ్వు మా అమ్మవే. మనసు కష్టపెట్టుకోకు సుమా. నేను కనుక కొడుకుని కంటే, కోడల్ని కనటానికి నువ్వు సిద్ధమవ్వాలి మరి.

సదా నీ ఆశీస్సులు కోరే

నీ ప్రియమైన ఆడపడుచు

హైమవతి.

ఉత్తరం చూశాక శారద, కనీసం హైమ పురుడవ్వగానే వెళ్ళి తెచ్చుకుందామని భర్తతో అన్నది. అతనూ సరేనన్నాడు. హైమవతి చెప్పినట్లే నిజానికి ఆమెకు క్షణం తీరిక లేని పని ఉండనే ఉంది. అత్తగారు నేర్పిన నూలు వడికి ఖద్దరు తయారీకి అందించటం ఒక కొత్త బాధ్యత ఆమెకి. రోజులు ఎలా జరుగుతున్నాయో తెలియకుండానే గడిచి పోతున్నాయి.

## 13

ఉషోదయంతో పాటు పురిటి గదిలోంచి కేర్ కేర్ మని వినపడ్డ పసిబిడ్డ ఏడుపుతో ఇహలోకం లోకి వచ్చి పడ్డాడు పార్వతీశం. అతని మొహం సంతోషంతో ప్రఫుల్ల మయ్యింది. మనసు కుదుట పడింది. నర్సమ్మ లోపలి నించి తొంగి చూస్తూ "ఆడపిల్ల" అంది నవ్వుతూ. పార్వతీశం పొంగిపోయాడు. ఆ రోజుల్లో ఆడపిల్లంటే ముఖం ముడుచుకోవటం సాధారణం. కానీ పార్వతీశం దృష్టిలో ఆడపిల్ల అంటే ఇంటికి మహాలక్ష్మి. అందుకే అంతకుముందే మరో ఆడపిల్ల ఉన్నా అతని సంతోషం ఏమాత్రం తగ్గలేదు. ఎంతో సంబరంగా రాజేశ్వరితో అన్నాడు.

"రాజూ! నీకు చెల్లాయి పుట్టిందే. శుక్రవారం పూట మనింటికి లక్ష్మీదేవి వచ్చింది. స్వాతంత్రోద్యమం జరుగుతున్న ఈ సమయంలో మనింట వెలసింది భారతలక్ష

నీ చెల్లాయి మన దేశానికి స్వాతంత్ర్యం తెస్తుంది. అప్పుడిక మన భారత దేశం నవ్యంగా వెలిగి పోతుంది. నీ చెల్లి 'నవ్య భారత లక్ష్మి!' ఇంక మన భారతదేశానికి స్వతంత్రం వచ్చేస్తుంది. రావే రాజూ, లోపలికి వెళ్ళి నీ చిట్టి చెల్లెలు నవ్య భారత లక్ష్మిని చూసి వద్దాం." వెలుగుతున్న కళ్ళతో పురిటి గది కేసి కదిలాడు పార్వతీశం.

"నాన్నా! పాపాయో, బాబో వచ్చాక కాళ్ళు కడుక్కునే తనదగ్గరకి రావాలని అమ్మ చెప్పిందిగా."గుర్తు చేసింది రాజేశ్వరి.

"ఔను సుమా, పద గాబులో నీళ్ళతో కాళ్ళు కడుక్కునే లోపలికెళదాం." కూతురు బుగ్గలు పుణికాడు పార్వతీశం.

హైమవతి పక్కలో ఇంకా కళ్ళు కూడా తెరవకుండా పడుకున్న ఆ ఎర్రటి పురిటి కందును చూసిన మరు నిమిషం రాజేశ్వరి మనసు చెప్పలేని ప్రేమతో నిండి పోయింది.

"చెల్లాయి ఎంత బాగుందో! నాన్నా, నేను చెల్లాయితో ఆడుకుంటాను. అస్సలు పోట్లాడను. నా బొమ్మలన్నీ చెల్లాయి కిస్తాను. చెల్లాయంటే నాకెంతో ఇష్టం"

"అవునా రాజూ, తమ్ముడు పుట్టినప్పుడు కూడా నువ్విదే చెప్పావు. కానీ వాడితో ఎప్పుడు పోట్లాడుతూనే ఉంటావు" నవ్వుతూ అన్నాడు పార్వతీశం.

"పో నాన్నా, తమ్ముడెప్పుడూ అన్నయ్యతోనే తిరుగుతాడు. వాడికి అన్నయ్యంటేనే ఇష్టం. నేనంటే కాదు. అందుకే చెల్లాయి, నేను ఒక జట్టు."

రాజు మాటలకు హైమవతి, పార్వతీశం మనస్ఫూర్తిగా నవ్వుకున్నారు.

★★★★★

ఇప్పట్లో కాన్పు వచ్చే సూచనలే లేవని చెప్పటంతో పక్క ఊరికెళ్ళిన తాను వచ్చేసరికి, హైమవతి కాన్పు అయిపోవట మనేది శయనమ్మకు కొరుకుడు పడలేదు. నొప్పులొస్తున్నాయని చెప్పనందుకు హైమ మీద అలిగిందామె. ఊరినుంచి రాగానే హైమావతికి ఆడపిల్ల అని వార్త విని పార్వతీశం ఇంటికి సుశీలతో సహా పరిగెత్తుకు వచ్చిన ఆమె, కాళ్ళు కడుక్కుని పురిటిగదిలో ఉన్న నవజాత శిశువును, తల్లిని చూడటానికి వెళ్ళింది.

"ఎంత పనిచేశావమ్మాయి, నాకో ముక్కయినా చెప్పలేదే నొప్పులొస్తున్నట్టు.చెపితే వెళ్ళేదాన్ని కాదుగా" కినుకగా అంటూ చిన్నారి పాపాయిని చేతుల్లోకి తీసుకుంది శయనమ్మ.పాపాయి ముద్దు మొహం చూడటంతోనే శయనమ్మ అలుక తీరి, పరవశించి పోయింది.

"అమ్మాయి, నేను లేనప్పుడు ప్రసవించావని నీతో పోట్లాడడానికి వచ్చాను. కానీ పండంటి మనవరాలిని ఇచ్చేసరికి ఏమీ అనలేక పోతున్నాను. ఏమి వెలుగమ్మా నీ పాప మొహంలో! చాలా గొప్ప వ్యక్తి అవుతుంది!" ఆశీర్వదించింది మనస్ఫూర్తిగా.

"అంతా మీ ఆశీర్వాదం పిన్నిగారూ. అమ్మ దగ్గర లేదన్న లోటు లేకుండా చూసుకున్నారు." అన్నది హైమవతి నవ్వుతూ. సుశీల అప్పుడే పుట్టిన ఆ పసిపాపని విచిత్రంగా చూస్తోంది.

"ఇంతకీ నా మనవరాలి పేరేమి పెడతారు? ఏమన్నా అనుకున్నారా? కుతూహలంగా అడిగింది శయనమ్మ.

"ఇంకాఅనుకోవటమేమిటీ? వాళ్ళ నాన్నగారు కూతురుకి ''నవ్య భారత లక్ష్మి" అని పేరు ఖాయం చేసేస్తేను!" శయనమ్మ కళ్ళు మెరిశాయి.

"మా మంచి పేరు. నీ కూతురు లాంటి వాళ్ళు నిరంతరం, పేరుతోనే మనకి కర్తవ్య బోధ చేస్తారు వాళ్ళని పిలిచినప్పుడల్లా! మనకి స్వాతంత్రం తెచ్చేస్తుందిలే నీ కూతురు." అని ఆశీర్వదించి, "ఇంతకీ మోడీ కారం తయారయ్యిందా లేదా? నేను వెల్లుల్లి కారప్పొడి కొట్టి తెస్తాను పత్యానికి." అంటూ హడావిడి మొదలు పెట్టేసింది శయనమ్మ. ఆవిడకి తను కనని ఈ కూతురుతో బంధం బాగానే పెరిగింది. పైగా ఆమె కేశవయ్య, సుబ్బమ్మ దంపతుల కూతురు కావడంతో వాళ్ళ మీద ఉన్న గౌరవమంతా, హైమవతి మీద అభిమానంగా మారింది.

★★★★★

హైమవతికి ఆడపిల్లని, తల్లీ పిల్ల క్షేమమని పాలేరు వచ్చి చెప్పటంతోనే, శారద సంబరం అంబరాన్నంటింది. వాడికి కడుపునిండా భోజనం పెట్టి, రెండు రూపాయలు ఇచ్చింది. సుబ్బారావు మటుకు తల్లిదండ్రులు, అత్తమామల అండ దండలు లేకుండా చెల్లెలు ఒక్కత్తి నలుగురు పిల్లలతో ఎలా చేసుకుంటుందో అని దిగులు పడ్డాడు. శారదే అతన్ని ఓదార్చింది.

"ఎందుకండీ, చిన్న విషయాలకి బెంగ పడతారు? అన్నయ్యగారు తోడు ఉండనే ఉన్నారు. అయినా వదిన ఎంత చక్కగా పెంచుకుంటుంది పిల్లల్ని? రాజుని ఈ సంవత్సరం కాగానే బడిలో వేస్తుంది. ఇప్పటికే ముకుందం బడికి వెళ్తున్నాడు కదా! ఇంట్లో ఉండేది ఒక్క మురారి. పైగా శయనమ్మగారి అండ ఉండనే ఉంది. ఆవిడ వాళ్ళని ఎంతలా కనిపెట్టుకుని ఉంటుంది?" భార్య మాటలకి ధైర్యం తెచ్చుకున్నాడు సుబ్బారావు.

"నువ్వన్నదీ నిజమేలే. కాకపోతే మనం ఉండీ ఏమీ సహాయం చెయ్యలేక పోతున్నామే అనే నా బాధ" నిట్టూర్చాడు సుబ్బారావు శారద వంక చూస్తూ.

"పోనీ నువ్వు వెళ్ళి నాలుగు రోజులుండి దాని అవసరం తీరాక వద్దువు గాని. రేపు నేను నిన్ను దింపి వస్తాను" అన్నాడు.

"ఆమ్మో, నేను అక్కడ ఉండిపోతే మీ నలుగురికి భోజనం ఇబ్బంది కాదూ? పైగా సాండర్స్ ను చంపినందుకు భగత్ సింగ్ అన్నను బందీ చేసి విచారిస్తున్నారు కదా. అతన్ని విడుదల చెయ్యమని ధర్నా చెయ్యటానికి బయల్దేరిన వారు మరో మూడు రోజుల్లో మన ఊరికి వస్తారుట. వారి భోజన ఏర్పాట్లు చూసుకోవద్దూ? దేశమంతటా అతని విడుదల కోసం ఆందోళనలు మొదలవుతున్నాయిట. ఏమవుతుందో ఏమో కానీ, వారికి మనం చేయగలిగిన సహాయం చెయ్యాలి కదా."

"బాగుంది శారదా. మీ అత్తగారిది గాంధీ వాదమైతే నువ్వు భగత్ సింగ్ సానుభూతిపరురాలివా?" మేలమాడాడు సుబ్బారావు. నిట్టూర్చింది శారద.

"నాకే వాదాలూ లేవు. కానీ ఇద్దరి పోరు భరతమాత దాస్య శృంఖలాలు తెంచటానికే. ఆ ఇరవై రెండేళ్ల యువకుడు మృత్యువుకి ఎదురు నిలుస్తున్నాడు దేశం కోసం. లాలా లజ్ పతి రాయ్ గారు మరణించినప్పటి పగను తీర్చుకోవటం కోసం ఆయన్ను చంపిన పోలీస్ అధికారి అనుకుని ఇతన్ని చంపాడు. ఈ సారి మటుకు ఉరిశిక్ష తప్పదంటున్నారు అందరు" నీళ్లు నిండిన కళ్ళతో అంది

భగత్ సింగ్ ని తలచుకుని సుబ్బారావు కళ్ళల్లో కూడా నీళ్ళు నిండాయి.

"ఇలా ఎంతమంది భరతమాత పుత్రులు, దేశంకోసం ప్రాణాలను పణంగా పెడుతున్నారో! ఉడుకు రక్తం పారే వయసు మంచి, చెడు ఆలోచించనియ్యదు." భర్త బాధ పడుతున్నాడని గ్రహించిన శారద నవ్వుతూ ఆట పట్టించింది.

"అబ్బో! తమరి వయసు అరవయ్యా? ఎనభయ్యా?"

## 14

'నవ్య భారత లక్ష్మి' బాలసారె భవ్యంగా జరిగింది. ఆ సమయానికి తల్లిదండ్రులిద్దరూ దగ్గర లేక పోయారని హైమవతి చిన్నబుచ్చుకున్నా, తనకెంతో ఇష్టమైన వదినగారి రాక ఆమెలో దిగులుని దూరంచేసింది. పైగా ఎంతో ఆత్మీయంగా చూసుకుంటున్న శయనమ్మ గారి ప్రేమ తల్లి ప్రేమ లాగానే ఆమెను మురిపిస్తోంది. శారద అప్పుడే మొదటిసారి శయనమ్మ గారిని చూడటం. ఆవిడ పాదాలకు నమస్కరించి, ఆశీర్వాదం తీసుకుంది. సుశీలను దగ్గరకు తీసుకుని ముద్దు చేసింది.

పార్వతీశం గారు బాగా పలుకుబడి ఉన్న మోతుబరి కావటంతో చుట్టుపక్కల నుండి చాలా మందే నవ్య భారత లక్ష్మిని ఆశీర్వదించటానికి వచ్చారు. అందులో సామాజిక వాదులు, స్వాతంత్ర వీరులు ఎందరో! పాపకు పెట్టిన పేరు వినగానే అక్కడ కరతాళ ధ్వనులు మ్రోగాయి.

"పార్వతీశంగారు పాప పేరులో కూడా దేశభక్తి చిందించారు." అన్నారు కొండా వెంకటప్పయ్యగారు. వారు అప్పటికే స్వాతంత్రోద్యమంలో చురుకుగా పాల్గొంటున్నారు.

అంతకు ముందే జనవరి నెలలో కాంగ్రెస్ వారు త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించటంతో, అది దేశమంతా ఎగురవేయసాగారు భారతీయులు. బ్రిటిష్ వారు ఆ సందర్భంగా జరిపిన కాల్పులలో వందలాది మంది అమరులయ్యారు. వేలమంది జైలు పాలయ్యారు. అయినా ప్రతి వారింట్లో త్రివర్ణ పతాకం ఉండటమనేది గర్వకారణం ఆ రోజులలో.

"పార్వతీశంగారూ, మీ పాప యొక్క అమ్మమ్మ, తాతయ్య ఇద్దరు స్వాతంత్రోద్యమంలో ఇప్పటికే పాల్గొంటున్నారు. పాపకు మీరు పెట్టిన పేరే మీ దేశభక్తిని చాటి చెప్తోంది. మీ అమ్మాయిలో సైతం భారత జాతి పట్ల ప్రేమ అంకురించాలనే ఆశతో ఈ త్రివర్ణ పతాకాన్ని బహుమతిగా ఇస్తున్నాను" అంటూ ఆ వేడుక కోసం తీరిక చేసుకుని వచ్చిన ఉన్నవ లక్ష్మీనారాయణ గారు జెండాను చిన్నారి చేతులలో పెట్టి,

"స్వతంత్ర భారతంలో మనమందరం బ్రతకాలి తల్లి!"అని ఆశాభావం వ్యక్తం చేస్తూ ఆశీర్వదించారు. అక్కడ ఉన్న వారందరూ ఏక కంఠంతో "భారతమాత కి జై " అని నినదించారు. దేశభక్తి భావంతో ప్రతి వారి గుండెలు ఉప్పొంగాయి.

ఉన్నవ వారి సతీమణి లక్ష్మీబాయి హైమవతికి పసుపు కుంకుమ లిస్తూ "అమ్మాయి, ఈ రోజులలో ఆడపిల్లలని చదివించటం ఎంతో ముఖ్యం. మీ అమ్మాయిని బాగా చదివించాలి సుమా. దేశం కోసం పనిచేసేలా తీర్చి దిద్దు. అమ్మాయి మోహంలో మంచి వర్చస్సు ఉంది " అన్నది. వినయంగా నమస్కరించింది హైమవతి. ఆమెతో పాటే చేతులు జోడించింది శయనమ్మ కూడా. ఆమెను అక్కడ చూస్తూనే ఉన్నవ దంపతులు ఆశ్చర్య పోయారు.

"మా శయనమ్మ ఇక్కడ ఉందంటే సేవ, చైతన్యం వెల్లివిరుస్తాయి. అమ్మాయి చేతుల మీదుగా నీ కూతురు పెరిగిందంటే గొప్ప యువతిగా ఎదుగుతుంది, శుభం" పంతులు గారు ఆశీర్వదించారు. మక్కువతో అక్కున చేర్చుకుంది లక్ష్మీబాయమ్మ శయనమ్మను.

"మా తోటలో పూసిన పువ్వువు నువ్వు. ఈనాటి నీ పేరుప్రఖ్యాతులు వింటుంటే కడుపు నిండిపోతోందే అమ్మాయి" అంటూ ఆనందం వ్యక్తం చేసిందావిడ

హైమకు ప్రత్యేకంగా దేశ సేవ పట్ల ఎటువంటి అనురక్తి విరక్తులు లేకపోయినా, నవ్య భారత లక్ష్మి బాలసారె నాడు వచ్చి పెద్దలందరూ ఆశీర్వదించిన ముహూర్త బలమేమో, తన పాపను ఆదర్శప్రాయంగా పెంచాలనే సంకల్పం మనసులో చోటు చేసుకున్నది. అందుకు మార్గం శయనమ్మ ఆలనపాలనలో తన చిట్టి తల్లిని ఉంచటమే అని, నాటి నాయకులందరూ ఆమెకు ఇచ్చిన విలువ చూసి, స్థిరంగా నిర్ణయించుకుంది హైమవతి.

చిన్నారి భారతి అక్క రాజేశ్వరికి, ఇద్దరు అన్నలు ముకుందం, మురారులకు ఆరో ప్రాణం అయిపోయింది. వారి అందరి లాలనలో అల్లారుముద్దుగా పెరుగుతోంది. వీరందరితో పాటు శయనమ్మకు ఆ పాప అపురూపమై పోయింది. సుశీలకు కూడ భారతి అంటే పంచప్రాణాలు. చూస్తూ, చూస్తూనే చిన్నారి భారతికి నెల నిండింది. ముందుకు జరుగుతోంది కాలం.

★★★★★

ఇక దేశంలో ఆనాడు నెలకొని ఉన్న పరిస్థితులు నాటినాటికి మారి పోతున్నాయి. భారతి పుట్టేనాటికే ఆమె అమ్మమ్మ, తాతయ్యలు ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొంటున్నారని తెలిసిన విషయమే కదా. దేశ భక్తులందరూ బ్రిటిష్ వాళ్ళు ఇచ్చిన బిరుదులను వెనక్కి ఇచ్చివేయటం మొదలు పెట్టారు. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా నిరసనలు ఉధృతమయ్యాయి. ప్రతి ఊరిలో ఎంతోమంది దేశభక్తులని ఖైదు చెయ్యటం, కొన్నాళ్ళు కారాగారంలో ఉంచాక, అప్పటి పరిస్థితి కొంచెం సర్దుకోగానే వదిలి పెట్టటం మామూలయ్యింది.

దేశభక్తులతో పాటు బ్రిటిష్ వారి తొత్తులు కూడా ఉండనే ఉన్నారు. వారు చాపకింద నీరులా విస్తరించి స్వతంత్ర పోరాటపు వీరుల కార్యకలాపాల గురించి బ్రిటిష్ వారికి ఉప్పు అందించడం కూడా జరుగుతుండేది.

గుంటూరు జిల్లాలో ఎందరో నాయకులు ఉద్భవించారు. అందరికి తెలిసిన వారు కొండా వెంకటప్పయ్యగారు, పట్టాభి సీతారామయ్యగారు, పర్వతనేని వీరయ్య చౌదరి గారు, ఉన్నవ లక్ష్మీనారాయణ పంతులు గారు, వావిలాల గోపాలకృష్ణయ్యగారు వంటి వారు. వీరందరూ ప్రజలలో స్వాతంత్ర స్ఫూర్తిని రగిల్చినవారే, సామాజిక సంస్కరణల బాట పట్టిన వారే, స్త్రీ విద్యను ప్రోత్సహించినవారే! వావిలాల వారు వ్యక్తిగత జీవితం దేశ సేవకి అడ్డమని బ్రహ్మచర్యం అవలంభించారు. ఉన్నవవారు బాలికల విద్యను ప్రోత్సహించేందుకు గుంటూరు లో శారదా నికేతన్ స్థాపించారు. కులవ్యవస్థను వ్యతిరేకిస్తూ 'మాలపల్లి' అనే నవలను వ్రాసారు.

## 15

భారతి పుట్టకముందు ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొనటానికని వెళ్లిన సుబ్బమ్మగారు, కేశవరావు గారు ఇంకా ఇల్లు చేరలేదు. ఇంట్లో పెద్ద దిక్కు లేక వచ్చే పోయే దేశబంధువులతో, బంధువులతో సతమతమవుతున్నా, శారద ఎంతో చాకచక్యంగా సంసారాన్ని నడుపుకొస్తోంది. బాలసారెకు వెళ్ళి వచ్చాక ఆమె మనసులో ఒక చిన్న బాధా వీచిక మొదలయ్యిందన్న మాట నిజం. అది కాపురానికి వచ్చి ఇన్ని సంవత్సరాలైనా తన కడుపు ఇంకా పండలేదన్న వెలితి మాత్రమే.

ఏదన్న కష్టం వచ్చి పడ్డప్పుడు కాలం కదలదు కానీ సంతోషంగా ఉన్నప్పుడు రెండు కాళ్ళా పరిగెడుతుంది. చిన్నారి భారతి ముద్దు మురిపాలతో ఆటపాటలతో రోజులు దొర్లిపోతున్నాయి ఇంటిల్లి పాదికీ. భారతికి

అప్పుడే మూడవనెల వెళ్ళింది కూడా. గాంధీ గారి వెంటే దేశాటన చేస్తున్న కేశవరావు దంపతులలో సుబ్బమ్మగారి నుంచి ఉత్తరం వచ్చింది కోడలికి, సబర్మతి ఆశ్రమంలో కొన్నాళ్ళు ఉండి, గాంధీ మొదలు పెట్టిన 'యువ భారతం' పత్రిక విషయాలు చూసుకుని వస్తామని. ఆ ఉత్తరం అందే నాటికి వాళ్ళు ఇల్లు వదిలి ఆరు నెలలు దాటింది. ఉత్తరం చూసుకుని ఒక నిట్టూర్పు విడిచింది శారద. ఇప్పటికి సబర్మతి ఆశ్రమానికి చేరారన్నమాట అత్తమామలు. ఇన్నాళ్లు వారి క్షేమ సమాచారాలని వారు తెలియచేయటమే కానీ, తమ తరఫు నుంచి వారికి జవాబు వ్రాసే వీలే లేకపోయింది. ఇక ఇప్పుడు వ్రాయవచ్చు. పైగా వ్రాయవలసిన అవసరం కూడా ఉంది. వెంటనే జవాబు రాయటం మొదలు పెట్టింది శారద. ఆమె చదవగలదే కానీ వ్రాయటం పెద్దగా అలవాటు లేదు. అందువలన ఉత్తరం వ్రాయటానికి చాలా సమయమే పట్టింది.

పూజ్యులైన అత్తయ్య గారికి,

ఉభయకుశలోపరి.

మీరు వ్రాయించిన ఉత్తరం అందింది. విశేషాలు తెలిసాయి. ఇక్కడ అంతా క్షేమంగానే ఉన్నాము. మరుదులు ముగ్గురు మీ మీద ఆట్టే బెంగ పెట్టుకోకుండా చక్కగా తిని, బడికి వెళ్ళి వస్తున్నారు. వారి ఆలనా పాలనలో నా ఆనందం పెరుగుతోంది. మీ పెద్దబ్బాయి కుశలమే. ఒక వారం క్రితం కొందరు స్వాతంత్ర్య సమర యోధులు మన ఇంటికి వచ్చారు. వారికి భోజన సదుపాయాలూ ఏర్పాటు చేసి, మీరు చెప్పిన విధంగానే వెళ్ళేప్పుడు బీరువాలోని డబ్బు తీసి ఇచ్చి, వారి ఆశీర్వాదములు తీసుకున్నాను. మళ్ళా మరో పది రోజులలో ఏవో సభల ఏర్పాట్ల కోసం వేరే బృందం వారు వస్తారట. తప్పకుండా మన ఇంట్లోనే బస చేయమని చెప్పాను. ఖద్దరు రోజూ వడుకుతున్నాను. బాగానే వస్తోంది. మన కర్రి ఆవు మొన్ననే ఈనింది. ప్రస్తుతం అందరం జున్ను తింటున్నాము. మన పక్కింటి పిన్నిగారికి కూడా పంపించాను.

మన హైమవతికి ఆడపిల్ల. ప్రస్తుతము ఐదవ నెల. తల్లి, బిడ్డా క్షేమమే. పిల్లకు "నవ్య భారత లక్ష్మి" అని పేరు పెట్టారు. పాపాయిలో మీ పోలికలు ఉన్నాయి అని అన్నయ్య గారు అన్నారు.

ముఖ్యంగా వ్రాయునది ఏమిటంటే మీరు త్వరలో బామ్మ కాబోతున్నారు. అందువలన ఒక్కసారి వచ్చి నన్ను ఆశీర్వదించగలరు. మీ అబ్బాయి గారికి ఈ విషయం ఇంకా చెప్పలేదు. మీ నోటి మీదుగా మీరు ఆ శుభవార్త చెప్తే బాగుంటుంది.

ఇంతే సంగతులు,చిత్తగించవలెను.

నమస్కారములతో,

మీ కోడలు

శారద వ్రాలు.

(తరువాయి వచ్చే సంచికలో)

COMMENTS